
ప్రజాశక్తి
శనివారం 18 ఏప్రిల్ 2024
5
పార్వతీపురం మన్యం



ఐటిఐ, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఈ ఏడాది ఒకేషనల్ గైడెన్స్‌తో పాటు ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఆసక్తి గలవారు సంబంధిత సంస్థల్లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు గడువు జూన్ నెల 1తో ముగియనుందని, కావున అభ్యర్థులు సకాలంలో తమ దరఖాస్తులను అందజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రాస్ ఓటింగ్ గుబులు

వైసిపి, టిడిపి అభ్యర్థుల్లో ఆందోళన



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల ముగిసి నాలుగు రోజులు కావస్తోంది. గెలుపోటములపై సమీక్షలు దాదాపు ముగిశాయి. ఎవరి ధీమాల్లో వారు ఉన్నారు. కానీ, తాజాగా వైసిపి, టిడిపి నాయకులు అభ్యర్థులు, నాయకుల్లో క్రాస్ ఓటింగ్ గుబులు మొదలైంది. విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇటువంటి చర్చే నడుస్తోంది. ముఖ్యంగా కొన్ని చోట్ల అభ్యర్థులను బట్టి, స్థానిక నాయకత్వంపై ఉన్న వ్యతిరేకత తదితర అంశాల ఆధారంగా ఎంపీ ఓటు ఒకపార్టీకి, ఎమ్మెల్యే ఓటు మరోపార్టీకి వేశారనే చర్చనడుస్తోంది. డబ్బు ప్రభావం ఉన్నచోట ఇంట్లో ఇద్దరు ఉంటే వారు అభిమానించే పార్టీకి ఒకరు, అధికంగా డబ్బులు ఇచ్చిన పార్టీకి మరొకరు వేసినట్టు చర్చ వినిపిస్తోంది. ఎస్.కోట టిడిపిలో నామినేషన్ దశవరకూ రెండు గ్రూపులు ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో ఒక గ్రూపు ఎంపీ ఓటు విశాఖ టిడిపి అభ్యర్థి భరత్‌కు వేసినప్పటికీ, ఎమ్మెల్యేకు ఓటు వేయలేదని చర్చనడుస్తోంది. వేపాడ మండలంలో ఎక్కువగా ఇలా జరిగినట్లు తెలుస్తోంది. అదే నియోకజవర్గంలో మిగిలిన చోట్ల టిడిపిలోని మరో గ్రూపు ఎమ్మెల్యే ఓటు టిడిపి అభ్యర్థికి వేసినప్పటికీ ఒకరిద్దని నేతల కనుసన్నల్లో వైసిపి అభ్యర్థికి వేసినట్టుగా చర్చనడుస్తోంది. బొత్సపై ఆకర్షణతోనూ కొన్ని ఓట్లు విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థి ఝన్సీలక్ష్మికి వెళ్లిపోయాయని కూడా ఆ నియోజకవర్గంలో చెప్పుకుంటున్నారు. విజయనగరంలోని కొన్ని మురికివాడల్లో ఇరు పార్టీల అభ్యర్థుల తరపునా డబ్బులు బలవంతంగా అంటగట్టడంతో అభిమాన పార్టీకి ఒక ఓటు, ఎక్కువ డబ్బులు ఇచ్చినవారికి మరో ఓటు వేశారని చర్చమొదలైంది. ఈ విషయంలో ఎక్కువగా టిడిపియే లాభపడే అవకాశం ఉంది. గజపతినగరంలో టిడిపి అభ్యర్థికి వైసిపి ఓట్లు కూడా పడ్డాయట. ఇక్కడ కొంతమంది కొత్త ఎంపీ అభ్యర్థిని కోరుకోగా, మరికొందరు ఎమ్మెల్యే ఓటుతోపాటు ఎంపీ ఓటు కూడా ఒకటో నెంబరుకే గుద్దేశారని సమాచారం. స్థానిక నాయకుడనే అభిమానంతో చీపురుపల్లి పట్టణంలో టిడిపి ఓటర్లలో కొంతవరకు వైసిపి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఓట్లు వేసినట్టు చర్చ ఉంది. అయితే, ఇంతకు మించిన స్థాయిలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వైసిపి అభిమానులు టిడిపి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుకు ఓటు వేసినట్లు చర్చ జరుగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. కలిశెట్టి తొలి నుంచీ అదే నియోజకవర్గం ఎమ్మెల్యే సీటు ఆశిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో స్థానికుడనే అభిమానంతో వైసిపి అభిమానులు కూడా అధిక సంఖ్యలో సహకరించారనే చర్చ నడుస్తోంది. అరకు పార్లమెంట్ పరిధిలోని మెంటాడ మండలంలో బిజెపి అభ్యర్థి ప్రచారం లేదు. ఈనేపథ్యంలో బిజెపి వ్యతిరేకులతోపాటు టిడిపి అభిమానులు కూడా సిపిఎం అభ్యర్థి అప్పలనర్సకు సహకరించారనే వాదన ఉంది. అటు పాలకొండ, భామిని, సీతంపేటలో కూడా ఈపరిస్థితే కనిపిస్తోంది. కురుపాంలో చాలా చోట్ల డబ్బు ప్రభావం కనిపించింది. అభిమాన పార్టీకి, డబ్బులు ఇచ్చిన పార్టీకి చెరుసగం వేశారని చర్చ నడుస్తోంది. ఈనేపథ్యంలో ఎవరికి వస్తాయనుకున్న ఓట్లు ఎవరికి క్రాస్ అయ్యాయో అనే ఉత్కంఠతో అభ్యర్థులు ఉన్నారు.

మహిళా ఓట్లపైనే ఆశలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్‌పై ప్రధాన పార్టీల్లో ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. ప్రధానంగా విజయనగరం పట్టణంలో 50 వార్డులతో పాటు నియోజకవర్గంలో ఉన్న 22 పంచాయతీల్లో మహిళలు ఎక్కువ మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దీంతో టిడిపి, వైసిపిల్లో కూడా ధీమా వ్యక్తం అవుతోంది. గత ఎన్నికల్లో 1,65,111 ఓట్లు నమోదు కాగా ఈ ఎన్నికలో 1,83,232 ఓట్లు నమోదయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా 2019 ఎన్నికల్లో 1300 పైగా ఓట్లు నమోదు కాగా తాజా ఎన్నికల్లో 4211 ఓట్లు నమోదయ్యాయి. నియోజకవర్గంలో 2,57,205 ఓట్లు అండగా పురుషులు 89,029 పురుషులు, మహిళలు 94,196 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం. పురుషుల కంటే మహిళల ఓట్ల శాతం పెరిగింది. మహిళల ఓట్లు ఎక్కువగా పోలవడంపై వైసిపి, టిడిపి ఇద్దరూ తమకే అనుకూలమని చెప్పుకుంటున్నాయి. సంక్షేమ పథకాలు ఎక్కువగా పొందిన మహిళలు పోలింగ్‌కు భారీగా తరలిరావడం తమకు సానుకూలంగా ఉంటుందని వైసిపి నాయకులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం పట్ల మహిళల్లో ఉన్న వ్యతిరేకత కారణంగా ఓట్లు వేసేందుకు తరలివచ్చారని టిడిపి నాయకులు అంటున్నారు. ధరలు ప్రభావం, మహిళలు ఆర్థిక అభివద్ధికి కార్పొరేషన్ రుణాలు లేకపోవడం, అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వంటి వ్యతిరేకత కారణంగా తమకే మహిళల ఓట్లు పడతాయని టిడిపి భావిస్తుంది. మొత్తంగా గతసారి ఎన్నికలతో పోలిస్తే 22 వేలకు పైగా పెరగడం, యువత ఉత్సాహంగా పాల్గొనడం, మహిళలు కూడా భారీగా పోలింగ్‌లో పాల్గొనడంపై ఎవరికి వారు తమదే గెలుపు అంటున్నారు.



ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన మహిళలు

ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిఆర్‌ఒకు ఉపాధ్యాయ సంఘాల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎన్నికల పోలింగ్ విజయవంతం చేసినప్పటికీ, విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయడంలో జాప్యం తగదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి అనితను కలిసి వినతి అందజేశారు. మూడురోజులు విధులు నిర్వహించినప్పటికీ, రెండు రోజులకు గాను రెమ్యూనరేషన్ ఇచ్చారని, మూడురోజుల రెమ్యూనరేషన్‌తో పాటు ట్రైనింగ్ రోజు కలిపి డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. రిజర్వులో ఉన్న ఉద్యోగులకు రెమ్యూనరేషన్ కొన్ని నియోజకవర్గాల్లో ఇవ్వలేదు, తక్షణమే వారికి రెమ్యూనరేషన్‌తో పాటు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. డిఆర్ఒ మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలో విధుల్లో ఉన్న పిఒపై కొంతమంది భౌతిక దాడి చేసిన విషయంలో ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని,చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగతా సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. డిఆర్ఒను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, ఆపస్ రాష్ట్ర కార్యదర్శి ఇ.రామునాయుడు, పిఆర్‌టియు నాయకులు కె.వి.రమణ, ఎపిటిఎఫ్ 1938 నాయకులు ఎ.వి.శ్రీనివాసరావు, ఎస్‌టియు జిల్లా నాయకులు వై.అప్పారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్, ఆపస్ నాయకులు ఎ.కిరణ్ కుమార్, ఎజి తాతారావు తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని రైతులకు ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ శుక్రవారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు విత్తనాల పంపిణీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. భూమిలో సారం పెంచేందుకు దుక్కికి ముందుగా వేసుకొనే పచ్చిరొట్ట విత్తనాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఏ రకం ఎన్ని కావాలో రైతులు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. ఇసి అనుమతితో ఆ ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామన్నారు. బిపిటి- 3291 (సోనా మసూరి) జనరల్ రాయితీపై 799 క్వింటాళ్ళు, 90 శాతం రాయితీపై 332 క్వింటాళ్లు ఇస్తామన్నారు. సాంబా మసూరి, ఇంద్ర, అమర, శ్రీధృతి, ఎంటియు 1224, 1318, స్వర్ణ, నెల్లూరు సన్నాలు, శ్రీకాకుళం సన్నాలు, తెలంగాణ సోనా రకాలను సాధారణ రాయితీపై 17,424 క్వింటాళ్లు కేటాయించారన్నారు. 90శాతం (గిరిజనులకు) రాయితీపై 8,992 క్వింటాళ్లు వస్తాయన్నారు. అలాగే గత ఏడాది జిల్లాలో 41,191 టన్నుల ఎరువుల వినియోగం జరగ్గా, ఈ ఏడాది 45,277 టన్నుల వినియోగాన్ని అంచనా వేసి ఎటువంటి ఎరువుల కొరత రాకుండా ముందుగానే యూరియా, డిఎపి, కాంప్లెక్స్, పొటాష్ వంటి ఎరువులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

సంయమనం పాటించండి

వైసిపి నాయకులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు సూచించారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసిపికి మద్దతు పలకడమే కాకుండా మండుటెండను సైతం లెక్క చేయకుండా అభ్యర్థుల గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత కూడా టిడిపి నాయకులు తమ అధినాయకుడి ప్రోత్సాహకంతో గ్రామాల్లో వైసిపి నాయకులను రెచ్చగొట్టే ధోరణికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. అందువల్ల అప్రమత్తంగా ఉండి సమన్వయం పాటించాలని కోరారు.

పోలింగ్ సరళిపై సర్వత్రా చర్చ

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఎన్నికలు సోమవారంతో ముగిశాయి. ఎలాంటి దుర్ఘటనలూ జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు పూర్తవడం పట్ల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు మంగళవారం నుంచి ప్రతిచోటా ఎన్నికల సరళిపైనే చర్చ సాగుతోంది. ఎవరు ఎటు ఓటేశారు? ఏ తరగతి ఏ పార్టీకి మద్దతుగా నిలిచింది? ఎవరికి ఎన్ని ఓట్లు రాబోతున్నాయి? ఏ అభ్యర్థి ఎన్ని ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నారు? అనే అంశాలపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరికి వారే తామే గెలుస్తామన్న ధీమాను వ్యక్తంచేస్తున్నారు.



- ప్రభుత్వ వ్యతిరేకతపై టిడిపిలో ఆశలు
- సంక్షేమ పథకాలతో మహిళలే గట్టెక్కిస్తారని వైసిపి విశ్లేషణ
- పాలక, ప్రతిపక్ష వ్యతిరేక ఓట్లు తమకేనంటున్న సిపిఎం
- 4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజవర్గంలో టిడిపి అభ్యర్థిగా తోయక జగదీశ్వరి, వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అభ్యర్థిగా మండంగి రమణ పోటీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల తరపున విపరీతమైన ప్రచారం జరిగింది. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, నాయకులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. సుమారు నెలరోజుల పాటు గ్రామాల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. అయినా కూడా ఓటరు ఏ పార్టీకి ఓటు వేశాడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఓటరు మనస్తత్వం అర్థం కాకపోయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు గెలుపు తమదంటే తమదంటూ లెక్కలు వేసుకుంటున్నారు. కచ్చితంగా ఇన్నివేల ఓట్ల మెజారిటీతో తమ అభ్యర్థి బయటపడతాడని ఒక పార్టీ అంటే.. కాదు తమ అభ్యర్థి ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తాడని మరో పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక సామాన్య ప్రజల విషయానికొస్తే అరుగుల మీద, రచ్చబండల దగ్గర, హోటళ్ళ ,టీ స్టాల్స్, చివరికి ఉపాధి హామీ పని దగ్గర కూడా ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే దాని పైనే చర్చ జరుగుతుంది. టిడిపి నాయకులు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల్లోకి వెళ్లిన చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అంటున్నారు. నియోజకవర్గంలో టిడిపిలో ఉన్న గ్రూపులను కలపడానికి ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ ప్రధాన పాత్ర పోషించారు. మూడు గ్రూపులుగా ఉన్న టిడిపిని ఎన్నికల దగ్గర పడేసరికి అందర్నీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పనిచేసేలా చేశారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులను, కార్యకర్తలను కలుపుకొని సమిష్టిగా పని చేయించారు. వలసలు వెళ్లిన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలి వచ్చారని, పైగా ఉద్యోగులు, నిరుద్యోగులు వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారని అందువల్ల పార్టీ విజయం ఖాయమని టిడిపి శ్రేణులు అంచనా వేస్తున్నారు.

గత రెండు ఎన్నికల్లో పాముల పుష్ప శ్రీవాణి భారీ మెజార్టీతో విజయం సాధించారు. మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తారని, దీనికి కారణం పేదలు, వృద్ధులు, మహిళలు వైసిపికి అండగా నిలబడ్డారని లెక్కలు కడుతున్నాయి. ఇందులో భాగంగానే ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు వస్తాయో అంచనాలు వేసుకుంటున్నారు. ఈ సారి ఆ గ్రామంలో ఫలానా పార్టీకి మెజార్టీ తగ్గి ఫలానా పార్టీ ఓట్లు పెరుగుతాయని లెక్కలు వేస్తున్నారు. ఫలానా గ్రామంలో రెండు పార్టీలకు సమానంగా ఓట్లు వస్తాయని కాకి లెక్కలు వేస్తున్నారు. ఇలా టిడిపి, వైసిపి గెలుపు ఖాయమని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

సిపిఎం శ్రేణులు మండంగి రమణ గెలుపునకు పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితర నాయకులు ఏజెన్సీలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. దేశానికి నష్టం కలిగిస్తున్న బిజెపి, దానితో అంటకాగుతున్న వైసిపి, టిడిపి, జనసేనలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆయా ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న నష్టాలను వివరించారు. ఈ అంశాలన్నీ గిరిజనుల్లోకి బాగా వెళ్లాయని, అధికార, ప్రతిపక్ష వ్యతిరేక ఓటు బాగా పడిందని సిపిఎం శ్రేణులు భావిస్తున్నాయి. గతం కంటే ఓటింగ్ తమకు బాగా పడిందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఎవరెన్ని లెక్కలు కట్టుకున్నా ఓటరు తీర్పు కోసం జూన్ 4వరకు వేచి ఉండాల్సిందే.

దోమల మందు స్ప్రేయింగ్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మలేరియా నియంత్రణే ధ్యేయంగా నిర్వహిస్తున్న దోమల మందు పిచికారీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఎంఒ టి. జగన్‌మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని జోగిదరమెట్ట గిరిజన సంక్షేమ వసతి గృహం-డోకిశీలలో చేపట్టిన మొదటి విడత దోమల మందు పిచికారి కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్ప్రేయింగ్ చేస్తున్న తీరును పరిశీలించి,ఇళ్లలో ఉన్న ఎన్ని గదులకు పిచికారీ చేస్తున్నదీ గమనించారు. దోమల మందు ఏసిఎం5శాతం రసాయనం వినియోగించే మోతాదు, స్ప్రే చేసిన ఇళ్ల వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో జ్వరాలపై ఆరా తీసి, జ్వర లక్షణాలతో ఉన్న వ్యక్తికి అక్కడికక్కడే నిర్ధారణ పరీక్ష చేయించి మాత్రలు అందజేశారు. స్ప్రేయింగ్ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త పడొచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ డి.సూర్యనారాయణ, వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య, సబ్ యూనిట్ అధికారి ధనుంజయరావు, ఇఒ శ్రీనివాసరావు, సూపర్వైజర్లు కృష్ణంరాజు, రామకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

సిబిఎస్ఇ శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

సిబిఎస్ఇ సిలబస్ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద ఎంఇఒ ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఇస్తున్న సిబిఎస్ఇ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ఇస్తున్న శిక్షణపై ఏమైన ఉపాధ్యాయులకు సందేశాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు.శిక్షణకు స్టేట్ కోఆర్డినేటర్ శారద హాజరయ్యారు.



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

పోస్టల్ బ్యాలెట్ తరలింపుపై టిడిపి ఫిర్యాదు



జెఎన్‌టియు వద్ద టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

తమకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా తహశీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలెక్టరేట్‌కు తరలించడంపై టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ అనితకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్ట్రాంగ్ రూమ్ తెరిచేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించలేదని తెలిపారు. అధికార పార్టీ అనధికార ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరవడం, ఇతరులకు ఎలాంటి సమాచారం లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. టిడిపి పార్లమెంట్, ఎమ్మెల్యే అభ్యర్థులకు లేదా వారి ఏజెంట్లకు కలెక్టరేట్‌కు మాత్రమే రావాఆలని సూచించడం ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్ తెరుస్తామని చెప్పలేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు బాధ్యత వహించే పాలనా యంత్రాంగం తమ బాధ్యతలను విస్మరించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఈ రకమైన చర్యలు ఇక్కడి ఎన్నికల యంత్రాంగంపై మాకు పూర్తి నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తాయని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రధానంగా పాలకవర్గానికి వ్యతిరేకంగా ఉందనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో అధికారుల చర్యలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అనంతరం జెఎన్‌టియుకు వెళ్లి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.

పోస్టల్ బ్యాలెట్ల తరలింపుపై సమాచారం ఇచ్చాం

పోస్టల్ బ్యాలెట్లను తహశీల్దార్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి కలెక్టరేట్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే విషయమై అన్ని పార్టీల జనరల్ ఏజెంట్లకు ముందస్తు సమాచారం ఇచ్చామని జిల్లా ఎన్నికల అధికారి తరపున డిఆర్ఒ అనతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై విజయనగరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిని వివరణ కోరామని, పోటీ చేసిన అభ్యర్థులందరికీ ముందస్తు నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారని పేర్కొన్నారు. నోటీసు అందినట్లు ధ్రువకరణ కూడా ఉందని తెలిపారు. అభ్యర్థుల తరపున హాజరైన వారి సమక్షంలోనే స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచినట్లు పేర్కొన్నారు.

దిబ్బలపాలెం సమీపాన

చిరుత సంచారం?

- గ్రామస్తుల్లో ఆందోళన
- పులిని చూశామంటున్న యువకులు



చిరుత పాదముద్రలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని దిబ్బలపాలెం సమీపాన చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుత పులితో పాటు దాని పిల్లల ఆనవాళ్లకు సంబంధించిన వేలిముద్రలు కనబడడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. చేపల కంచేరు పంచాయతీ దిబ్బల పాలెం గ్రామ సమీపంలోని విమానాశ్రయ నిర్మాణ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుందని గ్రామస్తులు గత ఐదు రోజులుగా ఆందోళన చెందుతున్నారు. అంతేకాక కొంతమంది యువకులు కూడా పులిని చూశామని చెబుతున్నారు. ఈనెల 13వ తేదీ రాత్రి దిబ్బల పాలెం గ్రామానికి చెందిన యువకుడు అర్ధరాత్రి ఇంటికి వెళుతుండగా అదే రహదారిలో రోడ్డు దాటుతుండగా పులిని చూసినట్లు చెబుతున్నాడు. 14వ తేదీన పాఠశాల సమీపంలో ఓ బాలుడు 40 మీటర్ల దూరంలో పులిని చూసి పరుగులు తీశాడు. దీంతో ఈ ప్రాంతంలో పులి తిరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు.

కాలివేలిముద్రలతో మొదలైన ఆందోళన

దిబ్బల పాలెం రహదారి నుంచి కౌలువాడ వెళ్లే రహదారిలో చిరుత పులికి సంబంధించిన వేలిముద్రలను చూశారు. గురువారం రాత్రి సంచరించినట్లుగా అనుమానిస్తున్నారు. పులి పిల్లలకు సంబంధించిన చిన్న కాలి వేలు ముద్రలు కూడా ఉండడంతో ఈ రహదారిలో రాకపోకలు చేసేవారి తో పాటు సమీప ప్రాంత ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. పులి తిరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లోనూ గ్రామస్తులు ప్రచారం చేస్తున్నారు. ఈ రహదారిని ఆనుకునే విమానాశ్రయ నిర్మాణ పనులు జరుగుతుండడంతో అందులో పని చేస్తున్న సిబ్బంది కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి కాలి వేలిముద్రలు నిర్ధారించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సంతోషపురంలో గజరాజులు

గరుగుబిల్లి : మండలంలోని సంతోషపురం గ్రామసమీపాన శుక్రవారం ఏనుగుల గుంపు సంచరిస్తోంది. కొమరాడ, జియ్యమ్మవలస మండలాల పరిధిలో సంచరించిన ఏనుగుల గుంపు ప్రస్తుతం సంతోషపురం గ్రామసమీపంలో సంచరిస్తున్నాయి. అలాగే ప్రధాన రహదారికి సమీపాన సంచరించిన ఏనుగులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నంతసేపు తోటపల్లి ప్రాజెక్ట్‌లో సేద తీరాయి. ఎండ తీవ్రత తగ్గిన అనంతరం తోటపల్లి ప్రాజెక్టులో నుంచి బయటికి వచ్చిన ఏనుగులు గుంపు సమీపంలోని పంట పొలాల్లో సంచరిస్తున్నాయి. పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తుండడంతో పంటలు పాడైపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏనుగులు సంచరించడంతో వంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి అతి సమీపంలో ఏనుగులు సంచరిస్తుండడంతో రహదారిపై ప్రయాణించే వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. తక్షణ ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని రైతులు, వాహనచోదకులు కోరుతున్నారు.



కుళాయి ద్వారా వస్తున్న బురదనీరు

మళ్లీ అదే పరిస్థితి
రంగుమారిన నీటితో పట్టణ వాసులకు అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో తాగునీటి సరఫరాలో పరిస్థితి యథావిధిగానే కొనసాగుతోంది. వర్షాకాలంలోనే కాదు వేసవిలోనూ ఎర్రని తాగునీరు సరఫరా చేయడంతో పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని 23, 24, 25, 26,27 వార్డులోకల కుళాయిల ద్వారా రంగు మారిన బురదనీరు సరఫరా కావడంతో ఆయా వార్డుల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఆ నీటినే పట్టుకొని మరిగించుకుని వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు ముగిసి ఐదు రోజులు కావస్తున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు వార్డుల్లో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరిగిన సమయాల్లో ఆ విభాగం సిబ్బందితో కలిసి కనీసం పర్యవేక్షించకపోవడం పట్ల పట్టణంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమస్యపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు స్పందించి శుద్ధమైన తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాడు - నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యా సంవత్సరం ప్రారంభానికి మండలంలో చేపడుతున్న నాడు - నేడు భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎంఇఒ -1 చంద్రశేఖర్ సూచించారు. మండలంలో నాడు - నేడు నిధులతో నిర్మిస్తున్న పలు పాఠశాలల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నాడు-నేడు భవన నిర్మాణ, మరమ్మతు పనులు సకాలంలో చేపట్టాలన్నారు. ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి సక్రమంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలన్నారు. జూన్ 12న పాఠశాలలో తెరిచేలోగా సాధ్యమైనంత మేరకు ఆయా భవన నిర్మాణాల పనులను అందించాలని ఆయన అన్నారు.



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లకు క్యాంపెయిన్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అడ్మిషన్ క్యాంపు శుక్రవారంనిర్వహించారు. ప్రిన్సిపల్ రామారావు ఆధ్వర్యంలో అధ్యాపకులు బృందాలుగా ఏర్పడి, మండలంలోని బాలగుడబ, గరుగుబిల్లి మండలంలో సన్యాసి రాజుపేటలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి ఇంటర్మీడియట్ విద్యలో ప్రైవేటు కళాశాలల కన్నా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సదుపాయాలను వివరిస్తూ సాధారణ, ఒకేషనల్ కోర్సులపై వారికి అవగాహన కల్పించారు. జూనియర్ కళాశాలలో ప్రత్యేక సదుపాయాలతో పాటు యోగా, విశాలమైన తరగతుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన వంటి మెరుగైన సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తెర్లి రవికుమార్, బి.లక్ష్మణరావు, ఎం.సత్యనారాయణ, ఆర్.సోమేశ్వరరావు, ఎ.రవికాంత్, పి.ఉమ, డి.లక్ష్మణరావు, కె.శాంతి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

మృతుడి కుటుంబానికి బీమా అందజేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రాజన్నగూడకు చెందిన సవర సన్నాయి ఆకస్మికంగా మృతి చెందారు. అతడి పేరు మీద స్థానిక ఎపిజివిబిలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా కట్టడం వల్ల అతని కుటుంబానికి ఆసరాగా, తన కుమార్తె సవర ప్రమీలకు బ్రాంచ్ మేనేజర్ పాండ్రంకి రవి కుమార్ రూ.2లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ సంవత్సరానికి జీవనజ్యోతి బీమాకు రూ.436 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2లక్షలు, సురక్ష బీమాకు రూ.20 చెల్లిస్తే ప్రమాద బీమా రూ.2లక్షలు వర్తిస్తుందని చెప్పారు. అకౌంట్ ఉన్నవారంతా కేంద్రప్రభుత్వం పెట్టిన ఈ పథకంలో ఖచ్చితంగా చేరాలని కోరారు. కార్యక్రమంలో, ఫీల్డ్ఆఫీసర్ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



19 నుంచి వార్షిక కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి శ్రీకోదండ రామస్వామి వారి వార్షిక కల్యా ణ మహోత్స వాలు ఘనంగా నిర్వహించేం దుకు దేవ స్థానం అధి కారులు ఏర్పా ట్లు చేస్తున్నారు. వైశాఖ శుద్ధ ఏకాదశి నుంచి వైశాఖ శుద్ధ పౌర్ణమి వరకు అనగా ఈనెల 19నుంచి 23 వరకు పాంచా ణిక దీక్షతో ఆల య అర్చకులు వి వి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వివి సూర్యనారాయణ వెల్లడించారు. ఈ వార్షిక కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తిప్పలు తప్పేనా?


- సమస్యల వలయంలో బాలుర గురుకుల పాఠశాల
- శిథిలావస్థకు చేరుకున్న భవనాలు
- వసతుల్లేక విద్యార్థులకు ఈ ఏడాదీ అవస్థలే
- మరో మూడు వారాల్లో ప్రారంభం కానున్న బడులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాల సమస్యల వలయంలో చిక్కుమిట్టాడుతోంది. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అరకొర సౌకర్యాల మధ్య ఈ ఏడాది అవస్థలు తప్పవానని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల దుస్థితిపై ఇప్పటికే అధికారులకు ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా ప్రయోజనం శూన్యం

స్థానిక ఐటిడిఎకు కూతవేటు దూరంలో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలను 1985లో ప్రారంభించారు. ఇప్పటికీ సుమారు నాలుగు దశాబ్దాలు కావస్తుండడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా అందులోనే ఉపాధ్యాయులు విద్యాబోధన నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో పాఠశాల కారితూ, పెచ్చులు ఊడినప్పటికీ 6 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. డైనింగ్ హాలు లేక విద్యార్థులు వరండాలోని భోజనం చేయాల్సి పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూడు గదుల వరకు వర్షాకాలంలో పాఠశాల కారుతుంది. ఇక శ్లాబ్ పెచ్చులు ఎప్పుడు తమపై పడతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటున్నారు.

ఈ పాఠశాలలో సుమారు 430మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గ వసతుల్లేకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. 2021లో పాఠశాలకు నాబార్డ్ నిధులు రూ.2 కోట్లు మంజూరైనప్పటికీ ఒక కాంట్రాక్టు టెండర్ ద్వారా పనులు దక్కించుకున్నారు కానీ పనులు ప్రారంభించలేదు. ఉపాధ్యాయ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో నివాసముండేందుకు వారు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఇక పాఠశాలకు ప్రహరీ గోడ లేదు. రాళ్లు తేలిన రహదారిపై విద్యార్థులు నడవవలసిన పరిస్థితి నెలకొంది.



కూలిన పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపాం

గురుకుల పాఠశాలకు అభివృద్ధికి నాబార్డ్ నిధులు రూ. రెండు కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టు టెండర్ ద్వారా దక్కించుకున్నప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో నోటీసులు పంపించాం.

- ఎస్.సింహాచలం, ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేటివ్ ఇంజనీర్.

సౌకర్యాలు కల్పిస్తే మరింత మెరుగైన ఫలితాలు

పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తాం. ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థులు 76 మందికి 76 మంది ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారు. 2023లో 77 మందికి 76 ఉత్తీర్ణులయ్యారు. 2022లో శతశాతం సాధించారు. ఇలా మా పాఠశాలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారు. వారికి, ఉపాధ్యాయులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తే మరింత నాణ్యమైన, మెరుగైన విద్య అందించేందుకు అవకాశం ఉంటుంది.

ఎస్ తిరుపతిరాజు, ప్రిన్సిపల్

స్థానిక గురుకుల బాలుర కళాశాలలో వివిధ గ్రూపులకు చెందిన 340 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వారు కాలేజీకి వచ్చేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రి వేళలో విషపూరిత జంతువులు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు

ప్రజాశక్తి -పాచిపెంట/మక్కువ

నేలలోని పోషకాలు క్షీణించకుండా భూసారాన్ని కాపాడుకోవడానికి ఏకైక మార్గం నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలని ఎపి సిఎంఎఫ్ రీజనల్ ట్రైనింగ్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని మాతుమూరు, పాంచాలి, మక్కువ మండలం పనసభద్ర లో ప్రకృతి సేద్యం ఖరీఫ్ ప్రణాళికను కేడర్‌కు వివరించడానికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు తో కలిసి మాట్లాడారు. సాలూరు సబ్ డివిజన్ పరిధిలో నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు చేరువ చేయాలని, భూసార పరిరక్షణకు ఏకైక మార్గం నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి భూమిలో కలియ దున్నాలని తెలిపారు. కట్టే జనుము, జీలుగ, పిల్లి పెసర, పెసర, మినుము, ఉలవలు, తోటకూర, గోంగూర, కొత్తిమీర, బీర, బొబ్బర, అలసంద, రాగులు, కొర్రలు వంటి పలు చిరుధాన్యాలు, కాయధాన్యాలు, ఆకుకూరలు అన్ని రకాలను కలిపి ఎకరానికి సుమారు 15 కిలోలు చల్లుకుని పూత దశలో కలియ దున్నుకుంటే నేలలో జీవవైవిధ్యం పెరిగి పలు రకాల వేరు వ్యవస్థల వల్ల జీవ ద్రవ్యం ఏర్పడి సేంద్రియ కర్బన శాతం పెరగడం వల్ల భూమి సారవంతమవుతుందని తెలిపారు. వీటితో పాటు బహుళ పంటల వల్ల కలుపు నివారించవచ్చన్నారు. నేల కోత నివారించబడుతుందని, ప్రధాన పంటకు చీడపీడలను ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. నేల గుల్ల బారడం వల్ల వానపాముల వృద్ధి, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, నవధాన్య పంటలు పశువులకు పచ్చి మేతగా ఉపయోగపడతాయని తెలిపారు. కూరగాయలు వంటి బహుళ పంటల వల్ల ఆదాయం లభిస్తుందని, ప్రధాన పంటలకు వాడే రసాయన ఎరువులను తగ్గించడం ద్వారా పర్యావరణం పరిరక్షించబడుతుందని తెలిపారు. నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం నవధాన్య పచ్చిరొట్ట విత్తనాల సాగును ప్రతి పంటలో వివిధ రకాల అంతర్ పంటల నమూనాలను ప్రకృతి సేద్య సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎ దినేష్ కుమార్, ఎపి సిఎం ఎఫ్ సిఆర్‌పి తిరుపతి నాయుడు, ఎన్ఎఫ్ఎ శారద, మండల యాంకర్ యశోదమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవిహెచ్ ప్రసాద్, పోలీసులు

అధిక లోడుతో వెళ్తే జరిమానా

ప్రజాశక్తి- సాలూరురూరల్

పరిమితికి మించి అధిక బరువులతో వెళ్లే వాహనాలకు జరిమానాలు తప్పవని సాలూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జెవివిఎస్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బొడ్డవలస వద్ద వాహనదారులకు, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లే ఆటోలను లారీలను ట్రాక్టర్ల వాహదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి అధికంగా మనుషులను ఎక్కించుకొని వెళ్లే ఆటోలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మండలంలో క్రషర్ల నుండి అధిక బరువులతో వెళ్లే లారీలు తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు మేరకే లోడింగ్ చేయాలన్నారు. ఆ లోడింగ్‌పై టార్పాన్లను కప్పి వాహనాలు వెళ్లాలని అలా కాకుండా ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే భారీగా జరిమానాలు తప్పవని ఆయన వాహనదారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి.కాశీరావు నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

శాంతియుత వాతావరణంపై అవగాహన

ప్రజాశక్తి- సీతానగరం

గ్రామాల్లో శాంతియుత వాతావరణాలపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఎం రాజేష్ తెలిపారు. మండలంలోని చినభోగిలిలో శుక్రవారం సాయంత్రం గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా ఉండాలని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నకు మద్దతుధర ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటించి, ఆ రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దలైపేట, వన్నం, పాలెం, కొట్టు తొడుము, కొమరాడ, కుమ్మరగుంట, దుగ్గి, గుణానుపురం, కల్లికోట, కంభవలస తదితర గ్రామాల్లో మొక్కజొన్న విస్తారంగా సాగైందన్నారు. అయితే పంటకు మాత్రం మద్దతు ధర లభించలేదన్నారు. పంటను రైతులు కళ్లాలకు తీసుకొచ్చి 15 రోజులైన కొనేవారు లేక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే సమయంలో ఒకవైపు వాన భయం, మరోవైపు ఏనుగుల భయంతో రైతులు రాత్రీ పగలు కళ్లాల్లో కాపలా కాస్తున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో రైతులు ఎవరికి అమ్మాలో తెలియని అయోమయం పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇదే అదునుగా దళారీలు తక్కువ రేటుకు అడుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మార్కెట్ అధికారుల ద్వారా అన్ని గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేలా వంద కేజీల మొక్కజొన్న పిక్కలను రూ.3వేలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.



కళ్లాల్లో ఉన్న మొక్కజొన్న పంట

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పశువులకు జబ్బవాపు వ్యాధి రాకుండా టీకాలు వేయాలని మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని శివ్వాంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు పలురకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పశువుల్లో వచ్చే జబ్బ వాపు వ్యాధి, గొర్రెలకు చిటికె వ్యాధుల నివారణకు విధిగా రైతులు టీకాలను వేయించాలన్నారు. జబ్బవ్వాపు వ్యాధి తెల్లజాతి రకాలైన ఆవులు, ఎద్దులకు సోకుతుందన్నారు. అలాగే ఆరోగ్యంగా, బలంగా ఉండే పశువుల్లో ఈవ్యాధి ఎక్కువగా వస్తుందన్నారు. తొలకరి చినుకులు పడిన అనంతరం ఉష్ణ ప్రాంతాలు, తేమగా ఉండే ప్రాంతాల్లో ఉన్న పశువులకు ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. బ్యాక్టీరియా వల్ల ఈ జబ్బువాపు వ్యాధి వస్తుందన్నారు. కలుషితమైన ఆహారం తినడం, నీరు తాగడం వల్ల ఈవ్యాధి పశువులకు సోకుతుందని చెప్పారు. మూగ జీవాలకు ఎటువంటి వ్యాధులు ప్రబలినా పశువైద్య కేంద్రాల్లో, రైతు భరోసా కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు విధిగా తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకా వేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారి సురేష్‌కుమార్

నేడు రేగిడి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల ఎంపిటిసిలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

మూఢ నమ్మకాల నివారణకు కృషి

ప్రజాశక్తి-బొబ్బిలి

మూఢనమ్మకాలు, మత విశ్వాసాల నివారణకు కృషి చేస్తామని భారత నాస్తిక సమాజం జిల్లా ప్రధాన కార్యదర్శి బంకురు జోగినాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మూఢ నమ్మకాలు, మత విశ్వాసాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో దేశ ప్రగతికి నష్టమన్నారు. పార్లమెంటులో మూఢ నమ్మకాలు, మత విశ్వాసాలు నివారణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సెంచూరియన్‌లో ముగిసిన బూట్ క్యాంప్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు బూట్ క్యాంప్ నిర్వహించారు. దాదాపు నిర్విరామంగా 72 గంటలపాటు సాగిన ఈ బూట్ క్యాంప్‌లో 180 మంది విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులు తయారు చేశారు. శుక్రవారంతో ముగిసిన ఈ కార్యక్రమంలో వెబ్ టెక్నాలజీస్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లకు సంబంధించి ప్రాజెక్టులు తయారు చేశారు. వాటిలో గ్రీన్ హౌస్ ఆటోమేషన్, టెర్రయిన్ రికగ్నిషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్, వేరబుల్ ఫిట్ నెస్ ట్రాకర్, ఆఫ్ లైన్ లాంగ్వేజీ ట్రాన్సలేటర్, కాఫీ కనెక్ట్, ప్లేస్‌మెంట్ డాష్ బోర్డు తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

నేరాలు ఘోరాలు



సంఘటనా స్థలంలో మృతి చెందిన రాజు

బస్సు ఢీకొని ఒకరు మృతి
మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని వెంకటరాజపురం, సుభద్రమ్మవలస సమీపాన ప్రధాన రహదారిపై శుక్రవారం బైక్‌ను ఓ ప్రయివేటు బస్సు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని బిజె పురం గ్రామానికి చెందిన డప్పు రాజు (30), మండంగి వెంకటరమణ కలిసి బైకుపై గవరంపేట పంచాయతీ వెంకటరాజపురం నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సుభద్రమ్మవలస మలుపు వద్ద పార్వతీపురం నుంచి బత్తిలి వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరమణకు ఎడమ కాలు, ఎడమ చేతికి తీవ్రగాయాలవ్వడంతో ఆయన్ను చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్ డ్రైవర్ చినమేరంగి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఇ.చిన్నంనాయుడు ఘటనాస్థలానికి వెళ్లి విచారణ జరిపారు. అనంతరం కేసు నమోదు చేశారు. మృతి రాజు పెయింటర్. తమకు చేదోడువాదోడుగా నిలిచే కుమారుడు అర్ధాంతరంగా మృత్యువాతాపడడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై రోధిస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి - సీతంపేట



మండలంలోని పులిపుట్టి సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హడ్డుబంగి విఆర్ఒ అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతురాలికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. పులిపుట్టి గ్రామం సమీపంలో గల ఎర్రచెరువు దగ్గర ఈ మృతదేహం లభించింది. ఈ మహిళ గురించి ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ, సీతంపేట 6309990883, సిఐ, పాలకొండ 6309990820 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.